క్లుప్తంగా

నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్‌గా భాస్కరరావు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్‌గా సూపరింటెండెంట్ ఇంజినీర్(ఎస్‌ఈ) పీవీకే భాస్కరరావును నియమిస్తూ మున్సిపల్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. నగర కమిషనర్ కీర్తి చేకూరి, నవంబర్ 5వ తేదీ వరకు స్వీడన్, ఆస్ట్రేలియా దేశాల్లో జరిగే అంతర్జాతీయ సదస్సుకు హాజరయ్యేందుకు వెళ్లనున్నారు. ఆమె స్థానంలో ఎస్‌ఈ భాస్కరరావు ఇన్‌చార్జి కమిషనర్‌గా వ్యవహరించనున్నారు.

సీజీజీబీ స్వచ్ఛత కార్యక్రమం



కొరిటెపాడు(గుంటూరు): చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్(సీజీజీబీ) గుంటూరు రీజినల్ కార్యాలయం, నగరంలోని అన్ని బ్రాంచీల ఉన్నతాధికారులు, ఉద్యోగులు, పలువురు ఖాతాదారులు కలసి శుక్రవారం బృందావన్ గార్డెన్స్‌లోని విష్ణు వాకింగ్ ట్రాక్‌లో స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీజీజీబీ చైర్మన్ టి.కామేశ్వరరావు మాట్లాడుతూ స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా పెండింగ్ ఫైల్స్ క్లియర్ చేయటం, రికార్డ్ నిర్వహణ, ప్రజాసంక్షేమం దష్ట్యా పరిసరాల పరిశుభ్రత వంటి అనేక అంశాలను అమలు చేయటంలో నిర్విరామ కృషి చేస్తోందని తెలిపారు. అనంతరం గార్డెన్స్ టెంపుల్ జాయింట్ సెక్రటరీ వి.నాగేశ్వరరావు, కాకతీయ కన్వెన్షన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ జీవీ రాయుడు చేతులమీదుగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో బ్యాంక్ విజిలెన్స్ ఇన్‌చార్జి రాంబాబు, అధికారి ఎన్.వి.విజయ్ కుమార్ ఆధ్వర్యంలో సత్య నిష్ఠ ప్రతిజ్ఞ తీసుకున్నారు. కార్యక్రమంలో పలువురు ఖాతాదారులు, విశ్రాంత ఉద్యోగులు, బ్యాంక్ జనరల్ మేనేజర్ మారుతిరాం, బ్యాంకు గుంటూరు రీజినల్ మేనేజర్ పి.వీరారెడ్డి, బ్యాంకు ప్లానింగ్ మేనేజర్ కె.ఆంజనేయులు పాల్గొన్నారు.

వ్యాపారిని మోసం చేసిన ఘటనపై కేసు

గుంటూరు ఈస్ట్: గుర్తుతెలియని వ్యక్తి షాపు యజమానిని మోసం చేసిన ఘటనపై లాలాపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. నల్లచెరువుకు చెందిన అడ్డా శ్రీనివాసరావు నూనె గానుగ నిర్వహిస్తుంటాడు. ఈనెల 23న వినియోగదారుడు షాపుకు వచ్చి ఆయిల్ కొనుగోలు చేశాడు. తన వద్ద డబ్బులు లేవని, ఇంటి వద్ద ఉన్న వదిన ఫోన్ పే చేస్తోందని చెప్పాడు. అందుకు శ్రీనివాసరావుకు ఒక ఫోన్ నంబరు ఇచ్చి ఇ నంబరుకు రూ.1 చెల్లించాలని కోరాడు. శ్రీనివాసరావు వినియోగదారుడు చెప్పిన విధంగా ఆ సెల్ నంబరుకు ఫోన్‌పే ద్వారా రూ.1 చెల్లించాడు. వినియోగదారుడు టీ తాగి వస్తానని వెళ్లాడు. కొంతసేపటికి శ్రీనివాసరావు అకౌంట్‌లోని రూ.82వేలు విత్‌డ్రా అయ్యాయి. శ్రీనివాసరావు తాను మోసపోయినట్లు గుర్తించి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బేల్దారు కార్మికుడిపై దాడి

గుంటూరు ఈస్ట్: బేల్దారు కార్మికుడిపై వాచ్‌మెన్ దాడిచేసిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. అరండల్‌పేట 1వ లైనులో నిర్మాణంలో ఉన్న భవనం వద్ద షేక్ సుభాని బేల్దారు పనులు చేస్తున్నాడు. నిర్మాణంలో ఉన్న వాచ్‌మెన్ వెంకట్ సుభానితో గొడవపడి దాడిచేశాడు. దాడిలో సుభానికి గాయాలు అయ్యాయి. శుక్రవారం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాలను సందర్శించిన ఉర్దూ డీఐ

తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి ఉర్దూ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఎం.డి.ఖాసిం సందర్శించారు విద్యార్థినిచే ఉర్దూ పాఠాన్ని బోర్డుపై రాయించి చదివించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నారని, నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తయారు చేశారని అన్నారు. అనంతరం పాఠశాల రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. సకాలంలో సిలబస్ పూర్తి చేసి రానున్న సమ్మెటివ్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

కాంట్రాక్టర్ల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

కమిషనర్ కీర్తి చేకూరి



కాంట్రాక్టర అర్జీలు పరిశీలిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగరంలో అభివృద్ధి పనులు చేపట్టే కాంట్రాక్టర్ల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించినట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. శుక్రవారం కమిషనర్ చాంబర్‌లో నగర పాలక సంస్థ కాంట్రాక్టర్లతో కమిషనర్ స్పెషల్ గ్రీవెన్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కాంట్రాక్టర్లు అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పూర్తి చేయాలని సూచించారు. నగరంలో అభివృద్ధి పనులు నిర్వహించే కాంట్రాక్టర్ల సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి శుక్రవారం ప్రత్యేకంగా గ్రీవెన్స్ ఏర్పాటు చేశామన్నారు. గ్రీవెన్స్‌లో కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి తెచ్చారని, వాటిని నిర్దేశిత గడువులో పరిష్కారం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కాంట్రాక్టర్లు వర్క్ అగ్రిమెంట్ పొందిన అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసినప్పుడే నగర అభివృద్ధి జరుగుతుందని, కాంట్రాక్టర్లు తాము పూర్తి చేసిన పనులకు సంబంధించి బిల్లుల ఆన్‌లైన్ చేయడం, చెల్లింపుల్లో ఎదురయ్యే సమస్యలను ప్రతి శుక్రవారం జరిగే స్పెషల్ గ్రీవెన్స్‌లో తమ దృష్టికి తీసుకురావచ్చన్నారు. కాంట్రాక్టర్లు అందించిన అర్జీలను, ఫిర్యాదులను ప్రత్యేకంగా నమోదు చేయాలని, వారి సమస్యలు పరిష్కారం అయ్యాక తెలియజేయాలన్నారు. అభివృద్ధి పనులు జరిగే సమయంలోనే ఆయా స్టేజిల ప్రకారం పనులను ఎం బుక్‌ను రికార్డ్ ఎమినిటీ కార్యదర్శుల ద్వారా చేయించాలని ఏఈలను ఆదేశించారు. బిల్లుల చెల్లింపులో జాప్యం లేకుండా అన్ని స్టేజిల్లో వేగంగా రికార్డ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎస్‌ఈని ఆదేశించారు.

కార్పొరేటర్ల నుంచి అందే అర్జీల పరిష్కారంపై నివేదిక ఇవ్వాలి

కార్పొరేటర్ల నుంచి అందే ఫిర్యాదులు, అర్జీల పరిష్కారంపై వార్డుల వారీగా నివేదిక ఇవ్వాలని విభాగాధిపతులను నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ చాంబర్‌లో నగరంలోని కార్పొరేటర్లతో వార్డుల్లో అభివృద్ధి పనులు, స్థానిక సమస్యలపై ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేసినప్పుడే ప్రజా సమస్యలు పరిష్కారం, నగర సమగ్రాభివృద్ధి జరుగుతుందన్నారు. వార్డుల్లో మౌలిక వసతులు, అభివృద్ధి పనులపై కార్పొరేటర్లకు చర్చించడానికి ప్రతి శుక్రవారం ప్రత్యేకంగా సమయం కేటాయించడం జరిగిందన్నారు. మిగిలిన రోజుల్లోనూరేటర్లకు అందుబాటులో ఉంటామని, వాట్సాప్‌లో సమస్యలు తెలిపినా తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి చేయాలి

- ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా, నూరిఫాతిమా
- గ్రూపు దేవాలయాల పాలక మండలి సభ్యుల అభినందన సభ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముస్తఫా, వేదికపై నూరిఫాతిమా, కావటి మనోహర్, సజీల,ఆతుకూరి

గుంటూరు ఈస్ట్: కొత్తపేట ఆంజనేయస్వామి దేవస్థానం ప్రాంగణంలో ఆంజనేయస్వామి, జగన్నాథ స్వామి, శ్రీవెంకటేశ్వరస్వామి మూడు గ్రూపు దేవాలయాల నూతన పాలక మండలి చైర్మన్, ధర్మకర్తల మండలి అభినంద సభ శుక్రవారం నిర్వహించారు. ఇటీవల ప్రమాణ స్వీకారం చేసిన పాలక మండలి చైర్మన్, సభ్యులను ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని కులాలకు ప్రాధాన్యమిస్తూ గ్రూపు ఆలయాల పాలక మండలి సభ్యులను నియమించడం అభినందనీయమన్నారు. నూతన పాలక మండలి సభ్యులు తమ బాధ్యతలను చిత్తశుద్ధితో నెరవేర్చాలని చెప్పారు. ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి, మంచి ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్, మేయర్ కావటి శివనాగమనోహర్‌నాయుడు, డిప్యూటీ మేయర్ షేక్ సజీల, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా, నూతన చైర్మన్ సూరినేడి దుర్గావరప్రసాద్, సభ్యులు ఉడతా మహేష్‌కుమార్, దమ్ములపాటి విజయనిర్మల, ఇస్లావత్ గాంధీనాయక్, ఎం.రాంబాబు, సూరిబోయిన వెంకట్రావు, మైలవరపు సృజన, తరిమెళ్ల వనజ, జవ్వాజి లక్ష్మి, ఎక్స్ అఫిషియో మెంబర్ ఆర్.టి.ఆర్.వి.ప్రసాద్, దేవస్థానం కార్యనిర్వహణ అధికారి జొన్నకూటి సూర్య ప్రకాష్, ఆలయ ప్రధాన అర్చకులు ఆర్.వి.ప్రసాద్, వైఎస్సార్‌సీపీ ఎస్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మేరాజోత్యు హనుమంత్ నాయక్, ఆతుకూరి ఆంజనేయులు, తాడిశెట్టి మురళీమోహన్ పాల్గొన్నారు.

చెరువుల సుందరీకరణకు ప్రత్యేక కార్యాచరణ

- నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు
- బుడంపాడు చెరువు అభివృద్ధి పనులు పరిశీలన



బుడంపాడులో చెరువు పరిశీలిస్తున్న నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు

గుంటూరు రూరల్: నగరంలోని చెరువుల సుందరీకరణ, అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో చర్యలు తీసుకుంటున్నామని నగర మేయర్ కావటి శివనాగమనోహర్‌నాయుడు అన్నారు. శుక్రవారం నగరంలోని 16వ డివిజన్ బుడంపాడులోని చెరువు అభివృద్ధి పనులను నగర పాలక సంస్థ అధికారులతో కలసి పర్యటించి పరిశీలించారు. మేయర్ మాట్లాడుతూ గత ప్రభుత్వాలు నగరంలోని విలీన గ్రామల అభివృద్ధిని నిర్లక్ష్యం చేశాయని చెప్పారు. వైఎస్సార్ సీపీ పాలకవర్గం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు ఆయా గ్రామాల సుమారు రూ.4 వందల కోట్లతో పనులు చేపట్టినట్లు వివరించారు. నగరంలోని 16వ డివిజన్ బుడంపాడులోని 55 ఎకరాల చెరువును అమృత్ పథకంలో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. బుడంపాడు చెరువులో న్యూ బండ్ ఫార్మేషన్, వాకింగ్ ట్రాక్ నిర్మాణం, డీవీడింగ్(పూడిక తీత) ఇతర సుందరీకరణ పనులు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో గుంటూరు నగరంలోని అన్ని డివిజన్లలో కుల, మత, పార్టీలకతీతంగా పారదర్శకంగా వివిధ అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నామని తెలిపారు. బుడంపాడులోని ఎస్సీ కాలనీలో రూ.50 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి పాలకవర్గం ఆమోదం తెలిపిందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ 16వ డివిజన్ ఇన్‌చార్జి పెద్దింటి రామకోటి, నగర పాలక సంస్థ ఈఈ కొండారెడ్డి, డీఈఈ కళ్యాణ్‌రావు, బోరుగడ్డ రజనీకాంత్, దాసరి వాసు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: వ్యక్తి ఆత్మహత్య ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. ముత్యాలరెడ్డినగర్‌కు చెందిన డి.మణికంఠ(25) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కుమార్తెకు హైదరాబాద్‌లో లివర్ సంబంధిత వ్యాధికి ఆపరేషన్ చేయించాడు. అప్పులు చేశాడు. చెల్లించలేక గురువారం మణికంఠ గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్టాన్‌ఫోర్డ్ యూఐఎఫ్ ప్రోగ్రామ్‌కు వీవీఐటీ విద్యార్థుల ఎంపిక



పెదకాకాని: ప్రతిష్టాత్మక స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీకి చెందిన డిజైన్ స్కూల్ నిర్వహించే యూనివర్సిటీ ఇన్నోవేషన్ ఫెలోస్ ప్రోగ్రామ్‌కు కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్లు చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. మండలంలోని నంబూరు వివిఐటి కళాశాలలో శుక్రవారం చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థులు 2024 ఏప్రిల్‌లో నెదర్లాండ్ యూనివర్సిటీ ఆఫ్ ట్వెన్‌టీలో నిర్వహించనున్న యూఐఎఫ్ అంతర్జాతీయ సదస్సులో పాల్గొంటారన్నారు. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ హస్సో ప్లాట్నర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్‌తో నిర్వహించే యూఐఎఫ్ కార్యక్రమం డిజైన్ థింకింగ్‌తో విద్యార్థుల్లోని సృజనాత్మకతను, నూతన ఆవిష్కరణలను రూపొందించే విధంగా ప్రోత్సహిస్తోందని పేర్కొన్నారు. కళాశాలకు చెందిన పోపూరి రిషిత, అభినవ్ అడ్డగట్ల, అభిరామ్ జొన్నలగడ్డ, చరిష్మా నేలకుర్తి, కృష్ణసుమంత్‌రెడ్డి పొలసాని స్టాన్‌ఫోర్డ్ సంస్థ నిర్వహించిన ఆరు వారాల డిజైన్ థింకింగ్ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని ఎంపిక ప్రక్రియలో ప్రతిభ కనపరచడం ద్వారా ఫోలోస్‌గా ఎంపిక కాబడ్డారన్నారు. 2017 నుంచి కళాశాలలో ప్రారంభమైన యూఐఎఫ్ కార్యక్రమం ద్వారా ఎంపిక కాబడిన విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపుతో పాటు సులువుగా సంక్లిష్ట సమస్యలను డిజైన్ థింకింగ్ ద్వారా పరిష్కరించగల నైపుణ్యం పెరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం ఎంపిక కాబడిన విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, జాయింట్ సెక్రటరీ మామిళ్లపల్లి శ్రీకృష్ణ, యూఐఎఫ్ ఫ్యాకల్టీ చాంపియన్ పీఆర్ కృష్ణప్రసాద్, డాక్టర్ సురేస్‌బాబు అభినందించారు.

రేపు శలపాడులో 'బజరంగ్ నేత్ర జ్యోతి'

ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ

కొరిటెపాడు(గుంటూరు): ఆరోగ్యవంతమైన జీవితం ప్రతి ఒక్కరికీ దక్కాలనే ఉద్దేశంతో నేత్రజ్యోతి పేరుతో బజరంగ్ ఫౌండేషన్ పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ తెలిపారు. చేబ్రోలు మండలం శలపాడు గ్రామంలో ఆదివారం బజరంగ్ నేత్రజ్యోతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కంటి సమస్య ఉన్నట్లు గుర్తించిన వారికి వారం రోజుల్లోగా కళ్లజోళ్లను అందించడం జరుగుతుందని వివరించారు. బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరంలో చేపడుతున్న ప్రతి సేవా కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేసి, ఈ సేవా పరంపర సత్ఫలితాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనకు అంకితం చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు సుమారు 9,139 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి, అందులో 6,504 మందికి కళ్లజోళ్లు అందించడం జరిగిందని వివరించారు. శలపాడు గ్రామ ప్రజల కోసం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో కళ్లజోళ్లు అవసరమైన వారికి కేవలం ఏడు పని దినాల్లోనే కళ్లజోళ్లు పంపిణీ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

నేడు మంచాలలో కళ్లజోళ్ల పంపిణీ

ఈ నెల 22వ తేదీన బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా చేబ్రోలు మండలం, మంచాల గ్రామంలో నిర్వహించిన నేత్రజ్యోతి శిబిరంలో కళ్లజోళ్లు అవసరమైన 361 మందికి శనివారం పంపిణీ చేయనున్నట్లు బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ వెల్లడించారు. సాయంత్రం 4 గంటలకు మంచాల గ్రామంలో 361 మందికి కళ్ళ జోళ్ళను పంపిణీ చేస్తామని చెప్పారు.

పక్షవాతం రాకుండా 90 శాతం నివారించవచ్చు

డాక్టర్ పమిడి ముక్కల విజయ



వైద్య పరీక్షలు చేస్తున్న సీనియర్ న్యూరాలజిస్టు డాక్టర్ విజయ

గుంటూరు మెడికల్: ప్రతి ఒక్కరూ తమ రిస్క్‌ఫ్యాక్టర్స్ తెలుసుకుని నియంత్రణలో పెట్టుకోవడం ద్వారా 90 శాతం పక్షవాతాలను రాకుండా నివారించవచ్చని లలిత గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్‌కు చెందిన సీనియర్ న్యూరాలజిస్ట్, ఏపీ న్యూరో సైంటిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ పమిడిముక్కల విజయ అన్నారు. వరల్డ్ స్ట్రోక్ డే పురస్కరించుకుని గుంటూరు కొత్తపేటలోని లలితా హాస్పిటల్‌లో పక్షవాత అవగాహన వారోత్సవాలను శుక్రవారం ప్రారంభించారు. వారోత్సవాల్లో భాగంగా తొలిరోజు పలువురికి ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. డాక్టర్ విజయ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా 25 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉన్న ప్రతి నలుగురిలో ఒకరికి వారి జీవిత కాలంలో స్ట్రోక్ వస్తుందన్నారు. సకాలంలో పక్షవాత లక్షణాలను గుర్తించి చికిత్స అందిస్తే ప్రాణాలు కాపాడవచ్చన్నారు. తలనొప్పి, చూపు మసక బారడం, మూతి వంకర, మాటలో తేడా వంటి లక్షణాలు స్ట్రోక్ వచ్చిన వారిలో కనిపిస్తాయన్నారు. అధిక రక్తపోటు, ధూమపానం, మద్యపానం, మధుమేహం, ఊబకాయం, ఒత్తిడి, అనారోగ్యకరమైన ఆహారాలు స్ట్రోక్‌కు కారణాలని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ముందస్తుగా వైద్య పరీక్షలు చేయించుకుని పక్షవాత రిస్క్‌ను తెలుసుకోవాలని సూచించారు. తమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రమంతటా ప్రజలకు పక్షవాతంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

కేఎల్‌యూలో ఆయుధాల ప్రదర్శన

తాడేపల్లిరూరల్: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మంగళగిరి 6వ బెటాలియన్‌కు చెందిన అధికారులు వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీలో విద్యార్థులకు ఆయుధాల గురించి అవగాహన కల్పించారు. మంగళగిరి ఆరో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ పి.వి.హనుమంతు మాట్లాడుతూ ప్రకృతి విపత్తుల సమయంలో ఏపీ విపత్తుల నిర్వహణ సిబ్బంది చేపట్టే చర్యల గురించి వివరించామని, విపత్తుల సమయంలో ప్రజలను ప్రమాదాల బారి నుంచి కాపాడడానికి ఉపయోగించే వివిధ పరికరాల గురించి అవగాహన కల్పించామన్నారు. శాంతిభద్రతలను కాపాడడానికి పోలీసులు ఉపయోగించే వివిధ ఆయుధాలు, రైఫిళ్లతోపాటు ఏకే 47 వంటి అత్యాధునిక మెషిన్ గన్‌ల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించామని తెలిపారు. వర్సిటీ విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల వలన సమాజ శ్రేయస్సు కోసం పోలీసులు నిర్వహించే విధుల గురించి అవగాహన ఏర్పడుతుందన్నారు.

మాజేటి సామాజిక సేవలు సాటిలేనివి



మాట్లాడుతున్న డాక్టర్ రమణరావు

గుంటూరు ఎడ్యుకేషన్: దేశ స్వాతంత్రానికి పూర్వమే విద్య పరమార్థాన్ని గ్రహించి విద్య, ధార్మిక, సామాజిక రంగాలకు పునాదులు వేసి, అభివృద్ధికి బాటలు వేసిన మాజేటి గురవయ్య సేవలు వర్తమాన, భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకమని ప్రముఖ హోమియో వైద్యుడు, పూర్వ విద్యార్థి డాక్టర్ ఎండీవీ రమణరావు పేర్కొన్నారు. బ్రాడీపేటలోని మాజేటి గురవయ్య డిగ్రీ కళాశాలలో మాజేటి గురవయ్య స్మారక ఉపన్యాస సభ శుక్రవారం నిర్వహించారు. డాక్టర్ రమణరావు మాట్లాడుతూ అన్ని సామాజిక రుగ్మతలకు సరైన మందు విద్యావంతులు కావడమేనని చెప్పారు. విద్యార్థి దశలో సెల్‌ఫోన్, సోషల్ మీడియాకు దూరంగా ఉండే విద్యార్థులు అనుకున్న లక్ష్యాలను సాధించగలరని అన్నారు. నగరంలో తనలాంటి వేలాది మందిని తీర్చిదిద్దిన గురవయ్య విద్యా సంస్థలు పదికాలాలపాటు వర్ధిల్లాలని ఆశాభావం వ్యక్తం చేశారు. జూనియర్, డిగ్రీ కళాశాలల కార్యదర్శి మాజేటి వెంకట రామకోటి ముత్యాలు మాట్లాడుతూ తమ తండ్రి స్థాపించిన విద్యాలయాలు, దేవాలయాలు, సత్రాల సేవలు తనతో పాటు తన వారసులు కొనసాగిస్తారని తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మంచాల బోసుబాబు మాట్లాడుతూ దశాబ్దాలుగా గురవయ్య విద్యాసంస్థల విద్యార్థులు విద్యతో పాటు క్రీడా, సాంస్కృతిక అంశాల్లో రాష్ట్రస్థాయిలో పేరు ప్రఖ్యాతలు గడిస్తున్నారని వివరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, అధ్యాపకులకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ పి.కమలవల్లి, గురవయ్య హైస్కూల్ కరస్పాండెంట్ ఎంపీఎస్ రామప్రసాద్, హిందూ హైస్కూల్ కౌన్సిల్ కార్యదర్శి కేఎస్ఆర్ కుటుంబరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాధవ పెద్ది విజయలక్ష్మి, హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు శారదా దేవి పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో వలంటీర్‌గా చేసేందుకు ముందుకు రండి..



వలంటీర్లతో మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో వలంటీర్‌గా చేరి ఆసుపత్రి అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ కోరారు. సామాజిక బాధ్యత కలిగిన స్వచ్ఛంద సేవా సంస్థలు, యువజన సంఘాలు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ ప్రతినిధులు జీజీహెచ్‌లో వలంటీర్లుగా పని చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. శుక్రవారం జీజీహెచ్ ఓపీ విభాగం వద్ద రోగుల రద్దీని దృష్టిలో పెట్టుకుని వలంటీర్ల సేవలపై సంబంధిత అధికారులతో సమీక్ష చేశారు. ఈసందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ నవంబర్ ఒకటి నుంచి బృహత్తర కార్యక్రమాన్ని చేపడుతున్నామని పేర్కొన్నారు. వలంటీర్ల వ్యవస్థ నిర్వహణకు నోడల్ ఆఫీసర్‌గా ఒకరిని నియమిస్తామన్నారు. ప్రస్తుతం జీజీహెచ్‌లో శ్రీ సత్య సాయి సేవ సమితి సేవలు అందిస్తోందని వివరించారు. వలంటీర్లుగా వచ్చే వారు తమ పేర్లను నోడల్ అధికారికి ఫోన్ చేసి నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్, డాక్టర్ వెంకట రమణ, నర్సింగ్ సూపరింటెండెంట్ సమీనా బేగం, అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందజేత

రవి హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో శుక్రవారం గుంటూరు జీజీహెచ్ శుశృత హాలులో దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న పలువురు చిన్నారులకు పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమానికి జీజీహెచ్ సూపరింటెండెంట్ ఎ.కిరణ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శ్రీబాలాజీ హాస్పటల్ అధినేత, సీనియర్ న్యూరో సర్జన్ డాక్టర్ బిజాపూరి చంద్రశేఖర్, డాక్టర్ లక్ష్మీగౌరి దంపతుల పుట్టిన రోజు సందర్భంగా ఉచితంగా అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఏఆర్టీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తమలపాకుల ప్రభాకరరావు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రాజెక్టు మేనేజర్ లంకపల్లి మధుసూదనరావు, ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకటసతీష్‌కుమార్ పాల్గొన్నారు.

ఎన్‌సీసీలో అత్యవసర సహాయంపై శిక్షణ



అత్యవసర పరిస్థితుల్లో తక్షణ సహాయంపై శిక్షణ ఇస్తున్న అధికారులు

గుంటూరు రూరల్: ధైర్య సాహసాలతో సత్వర సహాయం, ప్రాథమిక చికిత్స అందించడం ప్రాణరక్షణకు మూలకారణమని ఎన్‌సీసీ క్యాంపు కమాండెంట్ కల్నల్ నీరజ్‌కుమార్ పేర్కొన్నారు. ఆరు రోజులుగా చౌడవరంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న ఆంధ్ర బాలికల పదో బెటాలియన్ ఎన్‌సీసీ క్యాంప్‌ను ఆయన సందర్శించారు. శుక్రవారం శిక్షణలో భాగంగా ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు ఎన్‌డీఆర్‌ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది ఆధ్వర్యంలో అత్యవసర పరిస్థితుల్లో, విపత్తుల సమయంలో చేపట్టాల్సిన సహాయక చర్యలు, విన్యాసాలపై శిక్షణ ఇచ్చారు. శిబిరంలో వరదలు, తుఫాన్‌లు, భవనాలు కూలిపోవడం, కొండచరియలు విరిగిపడడం, అగ్ని ప్రమాదాలు విపత్తుల సమయంలో ప్రజలను రక్షించేందుకు సత్వర సమర్థవంతమైన సహాయక చర్యలను, ప్రథమ చికిత్సా విధానాన్ని ఎన్‌డీఆర్‌ఎఫ్ కెప్టెన్ మహేష్, అగ్నిమాపక సిబ్బంది ఏడీఎఫ్ఓ కె.కృష్ణారెడ్డి అవగాహన కల్పించారు. సాహసోపేత, తక్షణ సహాయక చర్యల ద్వారానే వివిధ ప్రమాదాల్లో చిక్కిన బాధితుల ప్రాణాలను కాపాడుకోవచ్చని, అందుకు తగిన విధంగా ధైర్యంగా విద్యార్థులు తయారవ్వాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏఓ డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాస్, క్యాంప్ డెప్యూటీ కమాండెంట్ కల్నర్ రెజిత్‌ముకుందన్, క్యాంపు ఎస్ఎం సుబేదార్ పాణ్యం రఫీ, పదో బెటాలియన్ ఎన్‌సీసీ సూపరింటెండెంట్ రాజశేఖర్‌బాబు, నాయబ్‌సుబేదార్ షేక్ ఖాజావలి, లెఫ్టినెంట్ డాక్టర్ తారాచంద్, లెఫ్టినెంట్ డాక్టర్ ఉషా పాల్గొన్నారు.

త్రోబాల్ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక

పెదకాకాని: విద్యార్థులు క్రీడా అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉప విద్యాశాఖాధికారి పి.వెంకటేశ్వరరావు అన్నారు. పెదకాకాని మండలంలోని తక్కెళ్లపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 17 నియోజకవర్గాలకు చెందిన బాల బాలికల జట్లకు త్రోబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ప్రతిభ కనపరచిన వారిని అండర్- 14 జిల్లా బాలుర జట్టుకు, బాలికల జట్టుకు ఎంపిక చేశారు. జిల్లా జట్టుకు ఎంపికైన వారు నంద్యాలలో జరిగే రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలలో పాల్గొంటారని వ్యాయామోపాధ్యాయుడు అశోక్ తెలిపారు. ఈ పోటీలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జీఎం శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించారు.

ఆర్‌బీకేల వద్ద పంట నమోదు జాబితా ప్రదర్శన

గుంటూరు రూరల్: గ్రామాల్లోని రైతులు తమ గ్రామాలోని రైతు భరోసా కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన పంటనమోదు లింక్ డిస్‌ప్లేలను తనిఖీ చేసుకోవాలని వట్టిచెరుకూరు మండలం వ్యవసాయ అధికారిణి కె.లక్ష్మి తెలిపారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల వద్ద ఖరీఫ్ పంటకాలంలో రైతులు నమోదు చేసుకున్న పంట నమోదుల డిస్‌ప్లేలను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ రైతులు రైతు భరోసా కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన పంట నమోదు డిస్‌ప్లేలో తమ పేర్లు వివరాలు సక్రమంగా ఉన్నాయో లేదో తనిఖీ చేసుకోవాలని సూచించారు. ఈనెల 26- 29వ తేదీ వరకూ ఈ ప్రదర్శన జరుగుతుందని ఏదైనా సమస్యలు ఉంటే వెంటనే సంబంధిత అధికారికి తెలియజేయాలని కోరారు. వాటిని అధికారులు వెంటనే సరి చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చేస్తారని చెప్పారు.

అంతర్జాతీయంగా భారత్‌కు గుర్తింపు



మాట్లాడుతున్న విశ్రాంత రాజనీతి శాస్త్రజ్ఞులు తిరుపతయ్య

లక్ష్మీపురం: మన దేశం నుంచి విదేశాలకు వెళ్లే వారు బాగా పెరిగారని, అంతర్జాతీయంగా ఉండే తీవ్ర పోటీని తట్టుకుని భారతీయులు ఎక్కువ మంది ఉపాధి అవకాశాలను పొందుతున్నారని విశ్రాంత రాజనీతి శాస్త్రజ్ఞులు ఎన్.తిరుపతయ్య అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శుక్రవారం సదస్సు నిర్వహించారు. న్యాయవాది అవధానుల హరి, సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి మాట్లాడుతూ విదేశాలకు వెళుతున్న భారతీయులు పెద్ద సంఖ్యలో పెరుగుతున్నారన్న వార్తలు సంతోషాన్ని, నిరాశను కలిగిస్తున్నాయన్నారు. ఆ నైపుణ్యాలను మన దేశాభివృద్ధికి వినియోగించు కోలేక పోతున్నమనే భాధ ప్రపంచ దేశాల్లో తమ చురుకుదనం, సాంకేతిక నైపుణ్యాలతో భారత దేశానికి మంచి పేరు తెస్తున్నారని చెప్పారు.